

సంక్షేమం ఆదుకుంటోంది..

తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో జిల్లాలో పలువురికి లబ్ధి చేకూరుతోంది. 8లో



ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్లు!

ప్రయాణికులకు మెరుగైన సేవలందించేలా ఆర్టీసీ డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్లను సంస్థ నియమించింది. 10లో

గరిష్టం / కనిష్టం

45° / 29°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండ వేడికి తోడు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

14నుంచి ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. జిల్లాలో తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా, ప్రశ్నాపత్రాల లీకేజీపై వదంతులను ఎవరూ నమ్మొద్దని, వదంతులు వ్యాపింపచేసే వారి వివరాలను కలెక్టర్, సీపీతో పాటు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

మైనార్టీ గురుకులాల్లో నియామకానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.ఏ.మహమూదీ తెలిపారు. జిల్లాలోని ఖమ్మం గర్ల్స్–1, 2, ఖమ్మం బాయ్స్–1 పాఠశాలల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మండుతున్న ఎండలు



ఖమ్మంవ్యవసాయం: ఎండలు ఏ మాత్రం తగ్గడం లేదు. నైరుతి రుతుపవనాల రాకకు మరో 15 రోజులు పడుతుందని వాతావరణ శాఖ పేర్కొంటోంది. దీంతో మరికొద్ది రోజులు అధిక ఉష్ణోగ్రతలను ప్రజలు భరించక తప్పేలా లేదు. నెల రోజులకు పైగా జిల్లాలో 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం జిల్లాలో 39.6 నుంచి 44.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పమ్మిలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, చింతకాని, నేలకొండపల్లి, బాణాపురంల్లో 44.5, ఖానాపురం, తిరుమలాయపాలెంల్లో 44.2, పల్లెగూడెం, ముదిగొండల్లో 43.8, బచ్చోడులో 43.7, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 42.9, పంగిడిలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నేడు రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో 32 వేల మందికి పైగా లబ్ధిదారులను 2017లోనే గుర్తించారు. వీరిలో 16 వేల మందికి మొదటి విడతలో గొర్రెలు ఇవ్వగా, రెండో విడతలో జాప్యం జరుగుతోంది. దీంతో దాదాపు 16,180 మందికి రెండో విడతలో గొర్రెలను ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతతో పోలిస్తే యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచగా, లబ్ధిదారులు పలువురు 25 శాతం వాటా చెల్లించారు. కాగా, శుక్రవారం ప్రతీ నియోజకవర్గంలో 24 మంది చొప్పున లబ్ధిదారులకు లాంఛనంగా గొర్రెల పంపిణీ చేస్తారు. దీంతో కొనుగోలు చేసిన గొర్రెలను జిల్లాకు చేర్చడంలో పశుసంవర్థక, పశువైద్య శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గాల వారీగా ఖమ్మంకు సంబంధించి జిల్లా కేంద్రంలో, పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలో, మధిర నియోజకవర్గ కేంద్రం, సత్తుపల్లి నియోజకవర్గంలో పెనుబల్లి జూనియర్ కళాశాలతో పాటు వైరా నియోజకవర్గ కేంద్రంలో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా గొర్రెల పంపిణీ చేస్తామని జిల్లా పశుసంవర్థక, పశువైద్యాధికారి డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు గురువారం వెల్లడించారు.

కుల, చేతి వృత్తులకు భరోసా



- వంద శాతం సబ్సిడీతో రూ.లక్ష సాయం
- అర్హులుగా బీసీ వర్గాల్లోని 15 కులాల ప్రజలు
- జిల్లాలో మొదలైన దరఖాస్తుల స్వీకరణ
- నేడు లాంఛనంగా పథకం ప్రారంభం

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ వర్గాల్లోని కుల, చేతివృత్తిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుంది. కులవృత్తులపైనే ఆధారపడి జీవిస్తున్న వారు అందుకు సంబంధించిన యూనిట్ల పనిముట్లు, ముడిసరుకు కొనుగోలు చేసుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అర్హులైన కుల వృత్తిదారులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో జిల్లాలో బీసీ వర్గాల్లోని కుల, చేతి వృత్తిదారులు ఆన్‌లైన్ సెంటర్ల వద్ద బారులు దీరుతున్నారు. గతంలో సబ్సిడీ, పిట్టీ రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను రద్దు చేయగా.. ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయానికి జిల్లాలో 45 వేల నుంచి 50 వేల మంది వరకు అర్హులు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.



15 కులాలకు అవకాశం...

బీసీ వర్గాల్లోని కుల, చేతి వృత్తిదారులు పనిముట్లు, పరికరాలు కొనుగోలు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని తొలి విడతలో 15 కులాలకే అందించనున్నారు. ఇందులో నాయీబ్రాహ్మణులు, రజక, సగర/ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అవుసల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్ల/వడ్ర/వడ్రంగి, శిల్పులు, కృష్ణ బలిజ పూసల, మేదర, వడ్డెర, ఆరె కటిక, మేర, ఎంబీసీలకు వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

20 నుంచి దరఖాస్తుల పరిశీలన

ఆర్థిక సాయం కోసం ఈనెల 6నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 20వ తేదీతో ముగుస్తుంది. దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీఓ, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్ 26వ తేదీవరకు పరిశీలిస్తారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేస్తే, 27వ తేదీన జిల్లా మంత్రి నుంచి లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసేలా కలెక్టర్ అనుమతులు పొందాలి. విడతలవారీగా అందించే ఆర్థిక సాయం లబ్ధిదారుల జాబితాను గ్రామ, మండల కార్యాలయాల్లో వెల్లడిస్తారు.

నెలలోగా యూనిట్ ఏర్పాటు

కుల, చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంపై వంద శాతం సబ్సిడీ ప్రకటించారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుంది. అయితే, లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకున్న యూనిట్‌ను సాయం అందిన నెలలోగా నెలకొల్పాల్సి ఉంటుంది. ఈమేరకు అధికారులు స్వయంగా పరిశీలించి ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. కాగా, ఆర్థిక సాయం అందించే పథకాన్ని తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులు అందజేయనున్నారు.

రెండేళ్ల క్రితం నాటి పత్రంతోనూ దరఖాస్తు



రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు 20వరకే గడువు ఉంది. ఈ సమయంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకోలేకపోతే 2021 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత ఎప్పుడు పొందిన పత్రంతోనైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక కుల ధృవీకరణ పత్రాలు వెంటనే ఇచ్చేలా రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఉంటుంది.

– జి.జ్యోతి, డీడీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ

కుటుంబంలో ఒకరికే..

రూ.లక్ష ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వం పలు నిబంధనలను విధించింది. కుటుంబంలోని ఒకరికే, ఈనెల 2వ తేదీ లోపు 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారికే అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.1.50 లక్షల లోపు వార్షికాదాయం, పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.2 లక్షల లోపు ఆదాయం కలిగిన వారు అర్హులని తెలిపారు. అలాగే, గత ఐదేళ్లలో రూ.50 వేలపైన ఎలాంటి సంక్షేమ రుణాలు పొందినా అనర్హులుగా పరిగణిస్తారు. అయితే, ఏదైనా కుటుంబానికి కల్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధి చేకూరితే మాత్రం అర్హులేనని వెల్లడించారు. ఇక ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2021 ఏప్రిల్ 1 తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోనే దరఖాస్తుకు అనుమతించారు.

సమైక్య పాలనలో చెరువుల చెర



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో స్టాళ్లను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ

- తెలంగాణ ఏర్పడ్డాకే నిండుకుండల్లా జలవనరులు
- ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్ష నేతలకు కడుపునొప్పి
- 'చెరువుల పండుగ'లో మంత్రి పువ్వాడ అజయ్



వలతో ప్రదర్శనగా వస్తున్న మత్స్యకారులు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షపు నీరు వృథా కాకుండా కాకతీయుల కాలంలో గొలుసుకట్టుగా చెరువులను తవ్విస్తే.. సమైక్య పాలనలో చెరువులన్నీ పూడుకుపోయాయని, మరికొన్నింటిని కొందరు ఆక్రమించుకున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కానీ తెలంగాణ ఏర్పడ్డాక అన్ని చెరువులను మిషన్ కాకతీయ పథకం ద్వారా పునరుద్ధరించగా సాగు, తాగునీటి ఇబ్బందులు తీరడమే కాక భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగ సందర్భంగా ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై మత్స్య శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఫిష్ ఫెస్టివల్‌ను మంత్రి ప్రారంభించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ సారథ్యంలో చెరువులన్నీ పునర్‌వైభవాన్ని సంతరించుకున్నాయని.. ప్రతీ గ్రామంలో మండుటెండల్లోనూ చెరువులు అలుగు పోస్తున్నాయని తెలిపారు. కేఎంసీ పరిధిలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కేటాయించిన రూ.34.65కోట్ల నిధులతో లకారం చెరువును ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దామని చెప్పారు. అలాగే, రూ.8.75 కోట్లతో నిర్మించిన తీగెల వంతెనతో పర్యాటక కళ సంతరించుకుందన్నారు. అయితే, ఈ అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషంగా ఉంటే భరించలేని ప్రతిపక్షాల నేతలకు కడుపునొప్పి వస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలువురు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర విత్తనాభి వృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్తా, మయాంక్ సింగ్, జల వనరుల శాఖసీఈ శంకర్‌నాయక్, అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి, టూరిజం అధికారి సుమన్‌చక్రవర్తి, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజుతో పాటు కార్పొరేటర్లు, కుల సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

వైభవంగా చెరువుల పండుగ

- తల్లాడ, కల్లూరుల్లో భారీ ర్యాలీలు
- భారీ బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ప్రదర్శన
- హాజరైన ఎంపీలు నామా, వద్దిరాజు, పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర



తల్లాడ ర్యాలీలో ఎంపీలు నామా, పార్థసారధిరెడ్డి, రవిచంద్ర, ఎమ్మెల్యే వెంకటవీరయ్య



కల్లూరు ర్యాలీలో ట్రాక్టర్‌పై ఎంపీలు నాగేశ్వరరావు, పార్థసారధిరెడ్డి, వద్దిరాజు, ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ: భారీ బతుకమ్మలు, జాలర్ల వలలతో తల్లాడలో భారీ ప్రదర్శన జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగ నిర్వహించగా తల్లాడలో జరిగిన కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయం నుంచి బతుకమ్మలు పేర్చిన ట్రాక్టర్లతో ఎదుళ్ల చెరువు వరకు ప్రదర్శన నిర్వహించారు.

అన్ని రంగాల్లో ఆదర్శంగా తెలంగాణ

తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని బీఆర్‌ఎస్ లోక్‌సభా నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ ఎదుళ్ల చెరువు వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, సాగు నీటి రంగాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. బంగారు తెంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర మాట్లాడగా డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జలవనరుల శాఖ డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ గంటా శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, నాయకులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వెంకట్‌లాల్, దూపాటి భద్రరాజు, పాట్టేటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో భారీ ర్యాలీ

కల్లూరు: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా కల్లూరులో నిర్వహించిన చెరువుల పండుగలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే వెంకటవీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లపై పేర్చిన బతుకమ్మలు, ఆటపాటల నడుమ కల్లూరు పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. సర్పంచ్ లక్కినేని నీరజ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాలెపు రామారావు, కొరకొప్పు ప్రసాద్‌తో పాటు డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు, ఇస్మాయిల్, ఎస్.కే.కమ్లి, గుర్రం శ్రీనివాసరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, మేకల కృష్ణ, రాచమళ్ల నాగేశ్వరరావు, కిరణ్, సందీప్ పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి ప్రతిరోజూ కూరగాయలు ఉచితంగా అందించేందుకు విజయవాడకు చెందిన భక్తవత్సల సేవా సమితి వారు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా కూరగాయలు తీసుకొచ్చే వాహనాన్ని ఆలయ ఈఓ రమాదేవి గురువారం ప్రారంభించారు. అనంతరం సంస్థ నిర్వాహకురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ రామయ్య భక్తులకు తాజా కూరగా యలతో భోజనం అందించాలన్న లక్ష్యంతో విజ యవాడ నుంచి ప్రతిరోజూ కూరగాయలు పంపించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే శ్రీరామనవమికి గోటి తలంబ్రాలు అందజేస్తున్నామని తెలిపారు.

నేడు ఖమ్మంకు బండి సంజయ్

- ఈనెల 15న రానున్న అమిత్‌షా పర్యటనపై సమీక్ష
- ముఖ్యనేతలతో భేటీ, మైదానం పరిశీలన



సాక్షిప్రతినిధి, ఖమ్మం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం ఖమ్మం రానున్నారు. ఈనెల 15న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్న నేపథ్యాన సంజయ్ వస్తున్నారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించడంతోపాటు సభ జరిగే సర్దార్ పటేల్ స్టేడియం గ్రౌండ్‌ను పరిశీలిస్తారు.

జనసమీకరణ, ఏర్పాట్లపై సూచనలు

బండి సంజయ్ శుక్రవారం ఉదయం ఖమ్మం చేరుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మండల పదాధికారులు, ఆపై స్థాయి నేతలతో సమావేశమవుతారు. బహిరంగ సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయడమే కాక నియోజకవర్గాల వారీగా జనసమీకరణ, ప్రచారం, ఏర్పాట్ల బాధ్యతలను ముఖ్య నేతలకు అప్పగించే అవకాశం ఉంది. ఆతర్వాత సంజయ్ బహిరంగ సభ జరిగే సర్దార్ పటేల్ స్టేడియంను పరిశీలించి వేదిక ఏర్పాటు, బారికేడ్ల నిర్మాణంపై చర్చిస్తారు.

ఖమ్మంలోనే నేతల మకాం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యే సభను విజయవంతం చేయడంపై దృష్టి సారించిన బీజేపీ నేతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈసందర్భంగా సంజయ్‌తో పాటు శుక్రవారం ఖమ్మం రానున్న నేతలు జనసమీకరణ తదితర అంశాలపై నిర్ణయం తీసుకుంటారు. కాగా, శుక్రవారం నుంచి సభ జరిగే 15వ తేదీన వరకు బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు ఖమ్మంలోనే మకాం వేస్తారు. సభ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నియోజకవర్గాల వారీగా ప్రచార బాధ్యతలు చేపడుతారు.

విద్యార్థులకు నష్టం కలగనివ్వొద్దు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో తీసుకుంటున్న చర్యలతో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. ఈమేరకు గురువారం డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు అవసరమైనచోట విద్యావలంటీర్లను నియమించాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కార్మికులను నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రసాదరావు, అప్పారావు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

జలపుష్పాల జాతర!

- జిల్లావ్యాప్తంగా మృగశిర సందడి
- చేపల కొనుగోళ్లకు జనం బారులు
- రిజర్వాయర్ల వద్దే అమ్మిన మత్స్యకారులు



వైరా రిజర్వాయర్‌లో చేపలు పడుతుండగా కొనుగోళ్లకు వచ్చిన జనం (ఇన్‌సెట్) తొమ్మిది కేజీల బొచ్చెతో...

ఖమ్మంవ్యవసాయం: ఎక్కడ చూసినా చేపలే! చేపల మార్కెట్లే కాదు రహదారుల కూడళ్లు, చెరువులు, రిజర్వాయర్ల వద్ద చేపల అమ్మకం గురువారం జోరుగా సాగింది. మృగశిర కార్తె ఆరంభమైన రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే నమ్మకంతో కొనుగోలుకు ప్రజలు బారులు దీరారు. దీంతో మార్కెట్లు, విక్రయ ప్రాంతాలు కిటకిటలాడాయి. మృగశిర కార్తె ఆనవాయితీని దృష్టిలో పెట్టుకుని మత్స్యకారులు స్థానిక చెరువుల్లో చేపలు పట్టగా.. వ్యాపారులు ఏపీ నుంచి భారీగా దిగుమతి చేసుకున్నారు. జిల్లాలో గురువారం ఒకేరోజు వంద టన్నుల వరకు చేపల విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా.

రకాల ఆధారంగా డిమాండ్

చేపల రకాల ఆధారంగా ధర పలికింది. సహజంగా ఇక్కడ లభించే కొర్రమేను చేప కిలోకు రూ.400 వరకు ధర ఉండగా.. గురువారం మాత్రం డిమాండ్ ఉండడంతో రూ.550కి పైనే అమ్మారు. అయినప్పటికీ ఈ చేపలు కొన్ని ప్రాంతాల్లో లభించాయి. ఇక పచ్చి రొయ్యలు కిలో రూ.450 నుంచి రూ.500 వరకు అమ్మారు. కాగా, చేపలు శుభ్రం చేసే వారు కూడా ఉదయం నుంచి సాయంత్రం బిజీబిజీగా కనిపించారు.

నేరుగా విక్రయాలు

కొందరు మార్కెట్లలో చేపలు కొనుగోలు చేయగా మరికొందరు నేరుగా చెరువులు, రిజర్వాయర్ల వద్దకు వెళ్లారు. మత్స్యకారులు కూడా అక్కడికక్కడే చేపలు పడుతూ అమ్మకాలు సాగించారు. తాజా చేపలు లభిస్తాయనే భావనతో పలువురు రావడంతో చెరువుల వద్ద రద్దీ కనిపించింది.

మృగశిర రోజు ఆనవాయితీ



ప్రతీ మృగశిర రోజున తప్పక చేపలను కొనుగోలు చేస్తాం. వర్షాకాలం ఆరంభంలో చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఈసారి చేపలకు బాగా గిరాకీ ఉంది. సాధారణ రోజుల్లో రూ.170వరకు అమ్మే బొచ్చెలను రూ.200కు అమ్మారు.

– సోమారపు సుధీర్, ప్రకాష్‌నగర్, ఖమ్మం

విక్రయాలు నాలుగింతలు పెరిగాయి



ఆదివారం కన్నా మృగశిర రోజు చేపలు నాలుగింతలకు పైగా విక్రయించాం. ఒకేరోజు నాలుగు క్వింటాళ్లకు పైగా విక్రయాలు జరిగాయి. ప్రతీ ఆదివారం క్వింటా నుంచి క్వింటాన్నర వరకు అమ్ముతాం. కానీ మృగశిర కావడంతో డిమాండ్ బాగా పెరిగింది.

–రేణుక, అమ్మకందారు, ఖమ్మం త్రీటౌన్ మార్కెట్

క్లుప్తంగా

పట్టా చేయాలన్నందుకు లంచం డిమాండ్

రూ.3వేలు తీసుకుంటూ పట్టుబడిన ఏన్కూరు తహసీల్దార్


లంచం తీసుకుంటూ పట్టుబడిన ఖాసీం

ఏన్కూరు/ఖమ్మం క్రైం: వారసత్వ భూమి పట్టా చేయాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతుండగా లంచం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసిన ఏన్కూరు తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరు మండలం భద్రుతండాకు చెందిన బానోతు రామకృష్ణ తన తల్లి బుజ్జి పేరిట రెండున్నర ఎకరాల భూమిలో 24 కుంటలను తన పేరిట పట్టా చేయాలని తహసీల్దార్ ఖాసీంను కోరాడు. అయితే, పట్టా చేయాలంటే రూ.5 వేలు ఇవ్వాలని స్పష్టం చేయడంతో రామకృష్ణ గతనెల 23న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు అన్ని ఆధారాలు సేకరించారు. ఇంతలోనే రూ.3వేలు ఇస్తానని చెప్పిన రామకృష్ణ గురువారం కార్యాలయంలో తహసీల్దార్ ఖాసింకు డబ్బు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకుని శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపా రు. అనంతరం ఖమ్మం చెరువు బజార్‌లోని ఖాసీం నివాసంలోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టగా.. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నియోగి బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకర్‌రావు, సంఘం సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: నియోగి బ్రాహ్మణులు ఐకమత్యంగా ఉంటూ పరస్పరం సహకరించుకోవాలని మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు కుమారుడు పీ.వీ.ప్రభాకర్‌రావు సూచించారు. ఖమ్మంలోని నియోగి బ్రాహ్మణ సేవాసంఘం కార్యాలయాన్ని గురువారం ఆయన రాష్ట్ర కరణం, నియోగి సంఘం అధ్యక్షుడు బండారు రాంప్రసాద్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరంజిల్లా అధ్యక్షులు పలివెల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సు కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి ప్రభాకర్‌రావు, మల్లెం రవిప్రసాద్, కొఠారు పాండురంగారావు, వనం కృష్ణవేణి, మంత్రిప్రగడ జగన్‌మోహన్‌రావు, సరస్వతికుమార్, మాటూరు లక్ష్మీనారాయణ, వీ.ఎల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 1 పరీక్షను బహిష్కరిస్తున్నాం


లైబ్రరీ వద్ద సమావేశమైన అభ్యర్థులు

ఖమ్మంగాంధీచౌక్: గ్రూప్ – 1 పరీక్షను స్వచ్ఛందంగా బహిష్కరిస్తున్నట్లు ఖమ్మం సెంట్రల్ లైబ్రరీలో సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రకటించారు. ఈమేరకు అభ్యర్థులు పలువురు గురువారం సమావేశమై ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే, పరీక్షను బహిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడంతో పాటు ప్రశ్నపత్రాలను లీకేజీకి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, టీఎస్‌పీఎస్సీకి నూతన చైర్మన్, సభ్యులను నియమించాకే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదంతా సాధ్యం కాకపోతే పరీక్ష నిర్వహణ బాధ్యతలు యూపీఎస్సీకి అప్పగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకోటి, నవీన్, రత్నాకర్, రాము, రమేష్, శ్రీలత, సాయిపల్లవి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

నేలకొండపల్లి: మండలంలో నాచేపల్లిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి గురువారం విచారణ చేపట్టారు. నాచేపల్లికి చెందిన గిరిజనుడైన భూక్యా రాముడుపై అదే గ్రామానికి చెందిన కె.మల్లికార్జున్‌రావు, కె.రామారావు గతనెల 20న దాడి చేసి, కులం పేరుతో దూషించటంతో నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో ఏసీపీ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించడంతో పాటు సాక్షులతో మాట్లాడారు. నేలకొండపల్లి ఎస్‌ఐ జి.స్రవంతి పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

కారేపల్లి: వడదెబ్బ కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇల్లందు ఇందిరానగర్ కాలనీకి చెందిన జనప వెంకటరమణ(34)కు భార్యతో విభేదాలు రావటంతో ఒంటరిగా నివసిస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఖమ్మంలోని తన సోదరి ఇంటికి వెళ్లి చెప్పకుండా వచ్చేశాడు. అప్పటి నుంచి కారేపల్లి మండలం నడిమూరులో తిరుగుతున్న ఆయన ఎవరైనా భోజనం పెడితే తింటున్నాడు. ఈక్రమంలో పొలాల్లోకి వెళ్లిన వెంకటరమణ వడదెబ్బ తగిలి అక్కడే మృతి చెందాడు.

సంక్షేమం ఆదుకుంటోంది..

'ఆసరా'తో లబ్ధిదారులకు ఊరట
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణ సాయం
- పేద విద్యార్థులకు సంక్షేమ వసతిగృహాలు
- దళితబంధు కింద రూ.394.50 కోట్ల విలువైన యూనిట్లు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వివిధ పథకాలను అమలు చేస్తుండగా జిల్లాలో లక్షలాది మందికి లబ్ధి చేకూరుతోంది. ఆసరా పెన్షన్లు, ఆర్థికంగా ఎదిగేందుకు రుణాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, ఉపకార వేతనాలు, దళితబంధు, ఉపాధి హామీ పథకం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలతో రూ.కోట్ల నిధులను పంపిణీ చేస్తున్నారు.

దళిత సాధికారిత కోసం

దళితుల ఆర్థికాభివృద్ధి కోసం వినూత్న ఆలోచనతో దళితబంధు పథకాన్ని తీసుకొచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 3,462 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.346.20 కోట్లు, నియోజకవర్గాల్లో 483 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.48.30 కోట్ల విలువైన యూనిట్లు అందజేశారు. జిల్లాలో మొత్తంగా 3,945 మంది లబ్ధిదారులకు రూ.394.50 కోట్ల విలువైన యూనిట్లు అందడంతో ఆర్థిక సాధికారత సాధించినట్లయింది.

బీసీలకు పెద్ద పీట

వృత్తి పనులపై ఆధారపడి జీవిస్తున్న వెనుకబడిన వర్గాల ప్రజల ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టింది. జిల్లాలో 2014–15 నుండి 2022–23 వరకు ఉపకార వేతనాల కింద 2,20,790 మంది విద్యార్థులకు రూ.103.99 కోట్లు మంజూరు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రింద 2,09,405 మందికి రూ.242.43 కోట్లు, ఈబీసీ విద్యార్థులు 42,541 మందికి రూ.78.51 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌గా అందజేశారు. ఇక మహాత్మా జ్యోతిబాఫూలే విదేశీ విద్యా పథకం ద్వారా 71 మంది విద్యార్థులకు రూ.11 కోట్లు మంజూరు చేసింది. ఇవేకాక నాయీబ్రాహ్మణులు, రజక కుల వృత్తిదారులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా, 824 మంది నాయీబ్రాహ్మణులు, 959 మంది రజకులకు లబ్ధి చేకూరింది.



- ఆసరా లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా తెలంగాణ ఏర్పడ్డాక పింఛన్ల మొత్తాన్ని పెంచారు. వృద్ధులు, వితంతువులకు నెలనెలా రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 చెల్లిస్తున్నారు. 201–15 ఏడాది నుండి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు జిల్లాలోని 1,92,342 మంది లబ్ధిదారులకు రూ.2,518.87 కోట్ల మేర పింఛన్ అందింది.
- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి వేగంగా సాగుతోంది. గ్రామాల్లో ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణం, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు నిర్మించారు.
- ఎస్సీ సంక్షేమశాఖ ద్వారా ఎస్సీల అభివృద్ధి కోసం పలు పథకాలను అమలు చేస్తుంది. జిల్లాలో విద్యార్థుల కోసం 52 వసతిగృహాలు నిర్వహిస్తుండగా నాణ్యమైన భోజనంతో పాటు సకలసౌకర్యాలతో వసతి అందుతోంది. అలాగే, ఉపకార వేతనాలు మంజూరు చేస్తుండగా, కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతి కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 24 జంటలకు రూ.62.50 కోట్లు అందజేశారు.
- మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక గురుకులాలు పాఠశాలలు ఏర్పాటు చేసింది. అలాగే, 2014–15 నుండి 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు జిల్లాలోని ఏడు గురుకులాలు, ఏడు జూనియర్ కళాశాల నిర్వహణకు రూ.122.86 కోట్లు వెచ్చించారు. అంతేకాక జిల్లాలో 29,912 మంది విద్యార్థులకు ఉపకార వేతనంగా రూ.66.93 కోట్లు చెల్లించారు.
- జిల్లాలో గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తోంది. 2014–15 ఏడాది నుండి 2022–23 వరకు 95,423 మంది గిరిజన విద్యార్థులకు రూ.162.14 కోట్లు ఉపకార వేతనాలు మంజూరు చేశారు. అలాగే, 3,246 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకం కింద రూ.2.37 కోట్లు అందాయి.

రైతు సంక్షేమం కోసమే ప్రాజెక్టుల నిర్మాణం

- వైరా చెరువుల పండుగలో మంత్రి పువ్వాడ
- హాజరైన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


మాట్లాడుతున్న మంత్రి అజయకుమార్, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి సాగునీటి కొరత తీర్చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. వైరాలో గురువారం రాత్రి తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన చెరువుల పండుగ సంబురాల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 30 కోట్ల నిధులతో 30వేల చెరువులలో పూడిక తీయించడంతో సాగునీరు సమృద్ధిగా అందుతోందని చెప్పారు. అలాగే, పంటను రైతులు దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. ఈమేరకు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను గడగడపకు తీసుకెళ్లి మూడో సారి సీఎం కేసీఆర్‌కు పట్టం కట్టే బాధ్యత ప్రతీ కార్యకర్త తీసుకోవాలన్నారు. తొలుత ఎమ్మెల్యే క్యాంపు నుండి వైరా రిజర్వాయర్ వరకు బోనాలు, బతుకమ్మలతో భారీ ర్యాలీ నిర్వహించగా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌రావు నృత్యాలతో అలరించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ స్నేహలత, జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, తహసీల్దార్ నారపోగు అరుణ, మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ బీడీకే.రత్నం, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గతో పాటు బాణాల వెంకటేశ్వర్లు, పసుపులేటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పర్మనెంట్ చేయాలని సబ్‌స్టేషన్‌కు తాళం

నిలిచిపోయిన విద్యుత్ సరఫరా


సబ్ స్టేషన్‌కు తాళం వేసిన మహేందర్, కుటుంబీకులు

రఘునాథపాలెం: మండలంలోని బావోజీతండాలో భూమిని సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్చిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్‌శాఖలో తాత్కాలిక ఉద్యోగాన్ని పర్మనెంట్ చేయాలని డిమాండ్‌తో రైతు ఆందోళనకు దిగాడు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం వచ్చిన ఆయన సబ్‌స్టేషన్‌కు తాళం వేయడంతో మూడు గంటల పాటు సరఫరా నిలిచింది. మహేందర్ తన వ్యవసాయ భూమిని సబ్ స్టేషన్ నిర్మాణానికి ఇవ్వగా విద్యుత్ శాఖలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పారు. కానీ తాత్కాలిక ఆపరేటర్‌గా పని చేయిస్తూ పర్మనెంట్ చేయడం లేదని చెబుతూ ఆయన ఉదయం 8 గంటలకు కార్యాలయం, సబ్ స్టేషన్‌కు తాళం వేశాడు. దీంతో డీఈ రామారావు, ఏడీ సంజయ్‌కుమార్, ఏఈలు సతీష్, ఇందిర చేరుకుని నచ్చచెప్పినా ఆయన వినకపోవడంతో మంచుకొండ సబ్‌స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా చేశారు. మూడు గంటల తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో రైతు ఆందోళన విరమించాడు.

ఆగని అక్రమ రవాణా..

- చెక్‌పోస్ట్ వద్ద కొరవడుతున్న నిఘా
- యథేచ్ఛగా గంజాయి తరలిస్తున్న స్మగ్లర్లు
- పట్టుబడుతున్నది సగాని కంటే తక్కువే
- అక్రమార్కులకు కొందరు ప్రభుత్వ సిబ్బంది మద్దతు ?


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద పోలీసులు, అటవీ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. చెక్ పోస్టులు, పోలీస్ స్టేషన్లు దాటుకుంటూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కొంతమేర చర్యలు చేపడుతున్నా.. అక్రమార్కులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ తమ పని కానిచ్చేస్తున్నారు. రకరకాల మార్గాల్లో గంజాయి తరలిస్తూనే ఉన్నారు. ట్రాక్టర్‌కు ప్రత్యేక బాక్స్‌లు అమర్చి అందులో తరలిస్తున్న 4.85 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు ఇటీవల పట్టుకోగా, మరో ఘటనలో కారులో దుస్తులు అమ్ముతున్నట్లు నమ్మించేందుకు పైన చీరలు అమర్చి, వాటి కింద 4.50 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడంతో నిందితులు వాహనం వదిలేసి పారిపోయారు. ఇలా నిత్యం భద్రాచలం మీదుగా గంజాయిని తరలిస్తూ కొందరు పట్టుబడుతున్నప్పటికీ.. అంతకు రెండు రెట్లు చెక్‌పోస్టు దాటి పోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడి చెక్‌పోస్టు దాటిపోయాక అందే విశ్వసనీయ సమాచారంతో జిల్లాలోని ఇతర పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటనలు కోకొల్లలు. అంటే భద్రాచలం చెక్‌పోస్ట్ వద్ద పటిష్ట నిఘా కొరవడిందని పలువురు అంటున్నారు.

సిబ్బంది పాత్రపై అనుమానాలు..

భద్రాచలం మీదగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకుంటున్నా.. అంతకంటే ఎక్కువగానే అక్రమంగా తరలిపోతోంది. ఎన్నో ఏళ్లుగా ఈ తంతు కొనసాగుతుండగా కొన్ని శాఖల సిబ్బంది అండదండలు వారికి ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో ఓ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సిబ్బంది గంజాయి అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని తెలిసి ఉన్నతాధికారులు వారిని బదిలీ చేశారు.

తనిఖీలు నామమాత్రమే..

భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద వాహనాలను నామమాత్రంగానే తనిఖీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది సిబ్బంది తనిఖీల కంటే వసూళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు సైతం వస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పోయే వాహనాల పత్రాలు మాత్రమే తనిఖీ చేస్తారని, ఫిజికల్ వెరిఫికేషన్ చేపట్టడం అరుదని కొందరు డ్రైవర్లే చెబుతుండడం గమనార్హం.

గత ఐదు నెలలుగా భద్రాచలంలో నమోదైన కేసులు ..

తేదీ	పట్టుకున్న గంజాయి (కేజీల్లో)	విలువ (రూ.లక్షల్లో)
జనవరి 23	58	11.60
ఫిబ్రవరి 14	132	26.40
మార్చి 13	16	3.20
ఏప్రిల్ 7	14	2.80
మే 28	485	97.00
మే 29	500	రూ.కోటి
మే 30	13	2.60
మే 31	13	2.60
జూన్ 6	100	20.0


భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద గల చెక్‌పోస్టు

కలిసే కానరాని లోకాలకు...

- రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ఇల్లెందురూరల్: ఇళ్లిళ్లా తిరుగుతూ.. సామగ్రి విక్రయిస్తూ రెక్కల కష్టంతో భార్యభర్తలిద్దరూ కుటుంబాన్ని పోషించారు. తాము పడిన కష్టం పిల్లలకు ఎదురుకావొద్దని ముగ్గురు పిల్లలను చదివించగా జీవితాల్లో స్థిరపడ్డారు. ఈ తరుణాల రోడ్డుప్రమాదం వారిద్దరిని బలి తీసుకుంది. ఇల్లెందు మండలం లలితాపురం సమీపాన గురువారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. లలితాపురానికి చెందిన నిడికొండ సుబ్బారావు, లలిత దంపతులు(బేడ బుడగజంగాలు) పల్లెలకు వెళ్లి వివిధ సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ముగ్గురి సంతానాన్ని చదివించగా కుమారుడు రాంబాబు, పెద్దకుమార్తె రాధిక బీటెక్, చిన్నకుమార్తె డిగ్రీ పూర్తిచేసింది. వీరిలో రాంబాబు ఇటీవలే ఉద్యోగంలో చేరగా రాధిక జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం చేస్తోంది. దీంతో తల్లిదండ్రులు మురిసిపోయారు. ఇక తల్లిదండ్రులను పువ్వుల్లో పెట్టుకుని చూసుకోవాలని పిల్లలు సైతం కలలు కన్నారు. ఈ తరుణాన గురువారం అస్వస్థతకు గురైన లలిత ను సుబ్బారావు ఆస్పత్రికి బైక్‌పై తీసుకెళ్తుండగా ప్రైవేట్ ఐటీఐ వద్ద ఎదురుగా వచ్చిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందగా లలితను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా తుది శ్వాస విడిచింది.

ప్రాణం తీసిన ఈత సరదా


వీరన్న (ఫైల్)

రఘునాథపాలెం: మండు వేసవిలో ఉపశమనం కోసం ఈత కొట్టాలన్నా సరదా నిండుప్రాణాన్ని బలి తీసుకుంది. మండలంలోని బూడిదంపాడుకు చెందిన తోకల వీరన్న, పోతన బోయిన ఉపేందర్ మార్బుల్ పనులతో జీవనం సాగిస్తున్నారు. గురువారం తెలిసిన వారి ఇంట్లో శుభకార్యం ఉండటంతో పనికి వెళ్లకుండా ఇద్దరు అక్కడకు వెళ్లి భోజనం చేశాక గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టాలని వెళ్లారు. అక్కడ బావిలో దిగాక తోకల వీరన్న(23) ఈత రాక ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో ఉపేందర్ వ్యవసాయమోటారు పైపులను పట్టుకుని బయటకు వచ్చి సమాచారం ఇచ్చాడు.

గంట పాటు పోరాటం

వీరన్న, ఉపేందర్‌కు ఈత సరిగ్గా రాకున్నా సరదా కోసం వ్యవసాయ బావిలోకి దిగినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఇబ్బంది ఎదురుకావడంతో ఉపేందర్ మోటార్ పైపును పట్టుకుని ఒడ్డుకు వచ్చాడు. ఇక అదే పైపును పట్టుకుని వీరన్న కూడా బయటకు రావాలని యత్నించినా పైపుకు ఉన్న పాకురు కారణంగా పట్టు దొరకలేదని తెలుస్తోంది. ఈక్రమంలో గంట పాటు పోరాడగా.. ఉపేందర్ ఇచ్చిన సమాచారంతో సమీప పొలాల్లోని వారు వచ్చేలోగా నీట మునిగి వీరన్న మృతి చెందాడని చెబుతున్నారు. ఈమేరకు ఘటనపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

తల్లాడ: తల్లాడ మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. ఈమేరకు ఎస్సై సురేష్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరు శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి ముత్యాలరావు(45) ట్రాక్టర్‌తో తల్లాడ మండలం రంగం బంజర చెరువు కట్ట మీద కిష్టయ్య బంజర వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడగా ముత్యాలరావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక మండంలోని రేజర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రామానుజవరానికి చెందిన నిమ్మకాయల నాగశ్రీను(43) మోటార్ సైకిల్‌పై తల్లాడ వైపు వస్తూ అంజనాపురం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకున్నాడు. ఆయన రోడ్డుపైకి వస్తుండగా తల్లాడ నుంచి కల్లూరు వైపు వెళ్తున్న బొలెరో ఢీకొట్టడంతో శ్రీనుకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఇక రెడ్డిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు వైరా రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడు. పెరుమాళ్లపల్లి జాన్(55) బుధవారం ఉదయం గేదెలను కాసేందుకు రిజర్వాయర్ సమీప పొలానికి వెళ్లాడు. గేదె దూడ నీళ్లలో మునగటంతో దాన్ని కాపాడేందుకు రిజర్వాయర్‌లోకి దిగాడు. అయితే, నీట మునిగిన ఆయన మృతి చెందగా.. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికారు. గురువారం ఉదయం రిజర్వాయర్ సమీపంలో మృతదేహం బయట పడడంతో పోలీసులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

బోనకల్: మండలంలోని రావపల్లె క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిన మహిళ మృతి చెందింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన షేక్ జాన్ బీ(45) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి భర్తతో కలిసి గురువారం బయలుదేరింది. ఈక్రమంలో రావపల్లె క్రాస్ వద్ద రహదారిపై ఉన్న గుంతలోకి ద్విచక్రవాహనం వెళ్లడంతో జాన్‌బీ ప్రమాదవశాత్తు జారి కిందపడింది. ఈ ఘటనలో ఆమెకు బలమైన గాయం కావటంతో 108లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండా పంచాయతీ పరిధిలోని చిన్నతండాకు చెందిన మైనర్ బాలిక(16) ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నతండాకు చెందిన బాలిక బుధవారం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు నేలకొండపల్లి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు. కానీ గురువారం పరిస్థితి విషమించటంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, బాలిక ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని మత్కేపల్లికి చెందిన దేవిశెట్టి శిరీష(19) ఉరి వేసుకు ని ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మంలో డిగ్రీ చదువుతున్న ఆమె ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి గురైన శిరీష ఈనెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకోగా, కాసేపటికి గుర్తించిన స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న ఆమె ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గురువారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. యువతి తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

గొంతు కోసుకుని...


రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

మధిర: మండలంలోని వంగవీడుకు చెందిన యనమల రాజశేఖర్‌రెడ్డి(30) గురువారం గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధిర రూరల్ ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఎవరూ లేని ఆయన బ్లేడ్‌తో గొంతు కోసుకుని మృతి చెందాడు. అయితే, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


జమాల్ (ఫైల్)


పాషా (ఫైల్)

తండ్రి చనిపోతాడని.. కొడుకు ఆత్మహత్యాయత్నం

గూడూరు: ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న తండ్రి చనిపోతున్నాడని తెలుసుకు న్న కొడుకు.. ఆవేదనతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని చెంద్రుగూడెంలో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందుగూడానికి చెందిన మహ్మద్ జమాల్ (55)కు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుక్కి పెళ్లి కాగా, చిన్న కొడుకు మహబూబ్ పాషా ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) చదువుతున్నాడు. నెల రోజులుగా తండ్రి జమాల్ అనారోగ్యంతో బాధపడుతున్నా డు. అతనికి క్యాన్సర్ అని వైద్యులు చెప్పడంతో 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజుల క్రితం తండ్రి జమాల్ పరిస్థితి విషమించిందని, కొద్దిరోజుల్లో చనిపోతాడని వైద్యులు చెప్పారు. దీంతో మహబూబ్‌పాషా గురువారం స్వగ్రామానికి చేరుకుని పురుగు మందు తాగి, బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ప్రథమ చికిత్స తర్వాత పాషాను వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మహబూబ్‌పాషా తండ్రి జమాల్ మధ్యాహ్నం 12 గంటలకు ఆస్పత్రిలో చనిపోయాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న మహబూబ్ పాషా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలిపారు.

వేములవాడ రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్లు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్నకు 15 రోజుల్లోనే రూ.2 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక ఓపెన్‌స్లాబ్‌లో హుండీలలోని నగదు లెక్కించారు. రూ.2 కోట్ల నగదు, 211 గ్రాముల బంగారం, 17,500 కిలోల వెండి సమకూరినట్లు ఈవో వెల్లడించారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు ప్రతాప నవీన్, జయకుమారి, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కు‘బడి బాట’..!

ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చేరికకు నామమాత్ర స్పందన

- స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించట్లేదంటున్న టీచర్లు
- ఉపాధ్యాయులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని భావిస్తున్న అధికారులు
- కొన్నిచోట్ల బడిబాటకు వెళ్లకుండానే వెళ్లినట్లుగా రికార్డులు!
- బడి మానేసిన వారిని 66 వేల మందిని గుర్తించినా చేరికలపై అస్పష్టత
- ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ ప్రైవేటు స్కూళ్ల జోరు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ చేపట్టిన ‘బడిబాట’కు స్పందన నామమాత్రంగానే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందుకు సహకరించట్లేదని ఉపాధ్యాయ వర్గాలు అంటుండగా..టీచర్ల నిర్లిప్తత ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రైవేటు స్కూళ్లు ఆకర్షించినట్టుగా విద్యార్థులను ప్రభుత్వ టీచర్లు ఆకర్షించడం లేదని ఉన్నతాధికారులు సైతం భావిస్తున్నట్టు సమాచారం. కాగా చాలాచోట్ల బడిబాట కార్యక్రమానికి వెళ్లేందుకు టీచర్లు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది. రికార్డుల్లో వెళ్లినట్టుగా చూపిస్తూ, ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు జిల్లా అధికారులు పంపుతున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా మారింది. డీఈవోలు, ఎంఈవోల కొరతతో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

బడి మానేసినవారు తిరిగి చేరేలా..

బడి మానేసిన వారిని బడికి తిరిగి రప్పించడమే కాకుండా, ప్రభుత్వ స్కూళ్లలోకి విద్యార్థులను మరలించేందుకు విద్యాశాఖ ఈ నెల 3 నుంచి ‘బడిబాట’చేపట్టింది. ప్రతి స్కూల్ పరిధిలో టీచర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలు బడిలో చేరేలా చూడాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

గుర్తించింది 66 వేలు..

ఏటా ప్రభుత్వ స్కూళ్లలో 2 లక్షల మందిని కొత్తగా చేర్పిస్తున్నామని విద్యాశాఖ చెబుతోంది. కానీ ఇప్పటివరకు బడిలో చేర్పించాల్సిన విద్యార్థులు 66,847 మందిని మాత్రమే గుర్తించినట్టు విద్యాశాఖ వెల్లడించింది. వీరిలో ఒకటవ తరగతిలో చేర్చాల్సిన వారి సంఖ్య 16,038 ఉంది. ఇందులో 12,120 మందిని అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు పేర్లు నమోదు చేశారు. ప్రైవేటు స్కూళ్లలో చేరేందుకు 1,181 మంది మొగ్గుచూపారు. ఇక 2,737 మంది బడిబాట బృందాలతో సంబంధం లేకుండానే స్కూళ్లలో చేరేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు 2–7 తరగతుల మధ్య బడి మానేసిన పిల్లలు 8,966 మందిని కూడా గుర్తించారు. వీళ్లు ఇప్పటివరకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎక్కడ చేరారన్నది స్పష్టత ఇవ్వలేదు.



రాజధాని పరిసరాల్లోనే ఎక్కువ

బడి మానేస్తున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకన్నా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువమంది ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 4,137 మందిని గుర్తించారు. హైదరాబాద్‌లో 2,376 మంది బడి మానేసినట్టు తెలుసుకున్నారు. మెదక్‌లో 2,254 మంది, మేడ్చల్‌లో 1,457 మంది బడికి దూరమైనట్టు గుర్తించారు. ఇక ఖమ్మం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో 3,371 మంది, నిజామాబాద్‌లో 4,107 మంది బడి మానేసిన పిల్లలున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో స్కూళ్లకెళ్లని విద్యార్థుల తల్లిదండ్రులంతా దినసరి కూలీలే కావడం గమనార్హం. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు పిల్లలను కూడా రోజువారీ పనులకు పంపుతున్నట్టు తేలింది. వీళ్లను గుర్తించడమే తప్ప, వీరంతా స్కూళ్లలో చేరతారా? లేదా? అనేది మాత్రం స్పష్టం కావట్లేదు.

ప్రైవేటు టీచర్లకు టార్గెట్లు

ప్రైవేటు స్కూళ్లు విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడమే లక్ష్యంగా ఏజెంట్లను రంగంలోకి దింపుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో చదివే వారికీ గాలమేస్తున్నాయి. గ్రామాల్లో కొంతమందికి కమీషన్లు ఇస్తూ పిల్లల్ని తమ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించాలని కోరుతున్నాయి. ఊరూరా ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నాయి. టీచర్లకు టార్గెట్లు విధించి మరీ విద్యార్థులను చేర్చేలా ఒత్తిడి చేస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రం మొత్తమ్మీద లక్షమంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో చేరినట్టు తెలుస్తోంది.

వర్క్ వీసా పేరుతో మోసం

- మలేషియాలో చిక్కుకున్న 19మంది తెలంగాణ, ఏపీ వాసులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబ సభ్యులు


మలేషియాలో చిక్కుకున్న బాధితులు (ఫైల్)

ఎర్రుపాలెం: విదేశాల్లో మంచి ఉపాధి కల్పిస్తామని, మెరుగైన వేతనం లభిస్తుందని బ్రోకర్లు చెప్పిన మాయమాటలు నమ్మి తెలంగాణ, ఏపీలకు చెందిన పలువురు మోసపోయారు. మోసానికి గురైన బాధితులు మలేషియాలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. దీనిపై బాధిత వ్యక్తుల కుటుంబసభ్యులు గురువారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, నారాయణపురం, జమలాపురం, అయ్యవారిగూడెం గ్రామాలతో పాటుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి పట్టణానికి చెందిన 12 మంది మహిళలు, ఏడుగురు పురుషులు బ్రోకర్ల వలలో చిక్కుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నూజీవీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మందపాటి నాగబాబు, హైదరాబాద్‌కు చెందిన పాదిల దాశరథి నాయుడు టూరిస్టు వీసాపై మలేషియాకు పంపించి అక్కడ వర్క్ వీసా వచ్చేలా చూస్తామని, మూడేళ్ల పాటు మెరుగైన వేతనం అందుతుందని నమ్మబలికారు. దీంతో మొత్తం 19 మంది రూ.1.90 లక్షల నుంచి 2.75 లక్షల వరకు నాగబాబుకు చెల్లించారు.

గత ఏడాది డిసెంబర్ 17నుంచి వీరిని విడతల వారీగా మలేషియా పంపించి హోటళ్లు, సంస్థల్లో క్లీనింగ్ పని ఇప్పించారు. కానీ కొన్నాళ్ల తర్వాత వీరి వద్ద వర్క్ వీసా లేకపోవడంతో యజమానులు పనిలో నుంచి తొలగించారు. కాగా, అక్కడి అధికారులు వర్క్‌వీసా లేని వీరికి భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.40 వేల చొప్పున జరిమానా విధించారు. దీంతో బాధితులు తమకు జరిగిన మోసం గురించి కుటుంబీకులకు చెప్పగా ఇక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులకు జరిగిన మోసంపై కేసు నమోదు చేసినట్లు ఎర్రుపాలెం ఎస్సై ఎం.సురేశ్ వెల్లడించారు.

భారీగా నకిలీ విత్తనాల పట్టివేత

వరంగల్‌లో రూ.2.11 కోట్ల విలువైన విత్తనాలు స్వాధీనం



పట్టుబడిన నకిలీ విత్తనాలు, ముఠా సభ్యులతో పోలీసులు

వరంగల్ క్రైం: వరంగల్ కేంద్రంగా నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న రెండు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన టాస్క్‌ఫోర్స్, మడికొండ, ఏనుమాముల పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.11 కోట్ల విలువైన 12 టన్నుల నకిలీ పత్తి విత్తనాలు, ఒక డీసీఎం వ్యాన్, ఒక కారు, రూ.21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం మీడియాకు తెలిపారు. ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన దాసరి శ్రీనివాస్, తాప్తే హన్మంతులు, హైదరాబాద్‌కు చెందిన చేడాం పాండ్, చేడాం వెంకటరమణ, వేముల అరవింద్ రెడ్డి, మంచిర్యాలకు చెందిన కొప్పుల రాజేష్, బోగే సత్యం, షేక్ అన్షద్, వెంకటేష్, పుట్ట రాజేశం, చంద్రపూర్‌కు చెందిన సురేందర్‌రెడ్డి, బల్లార్షకు చెందిన ఏన్గుడే దిలీప్, మహబూబ్‌నగర్‌కు చెందిన చేడాం నాగరాజు, బాపట్లకు చెందిన సుందర్ శెట్టి ఫణీందర్, నాగర్‌కర్నూల్‌కు చెందిన కాల్వ శ్రీధర్ అరెస్టు చేసినట్లు తెలిపారు. శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంప సదాశివ్‌లు పరారీలో ఉన్నారన్నారు. ముఠా సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు విడిగా విత్తనాలు కొనుగోలు చేసి వాటికి రంగులు అద్ది, ఎలాంటి జెనటిక్ ఫార్మింగ్ చేయకుండా పలు కంపెనీల పేరుతో ప్యాకెట్లు రూపొందించి క్యూఆర్ కోడ్ ముద్రించి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు సీపీ తెలిపారు. గుజరాత్ చెందిన నర్మద సాగర్ కోమార్కెటింగ్, రిషి, శ్రీగణేష్ కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలు తయారు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, కృపాకర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్ కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌ను రౌజ్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారించిన జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన విషయం విదితమే. కాగా జస్టిస్ నాగ్‌పాల్ గురువారం తీర్పును వెలువరించారు. తెలంగాణ ఎమ్మెల్సీ కవిత పేరును తీర్పును ప్రస్తావించడం గమనార్హం. ‘ఈ కేసులో పిళ్లై ప్రధాన నిందితుడిగా ఈడీ ఆరోపిస్తోంది. సౌత్ గ్రూపు తరపున పలు సమావేశాల్లో పాల్గొన్నారని పేర్కొంది. అడ్వాన్స్ కిక్‌బ్యాక్‌ల చెల్లింపుల్లో సౌత్ గ్రూపు సభ్యుడిగా ప్రమేయం ఉందని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతినిధిగా, ఇండో స్పిరిట్స్‌లో డమ్మీ పార్టనర్‌గా ఉన్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కుట్రలో పిళ్లై భాగస్వామ్యంపై మౌఖిక, డాక్యుమెంటరీ ఆధారం ఉందని ఈడీ పేర్కొంది. ఇండోస్పిరిట్స్ రూ.192 కోట్ల లాభాల్లో పిళ్లై రూ.32.86 కోట్లు ఆర్జించారని, పెట్టుబడి ఎమ్మెల్సీ కవిత పెట్టారని, కవిత ప్రతినిధిగా ప్రాపర్టీలు కొనుగోలు చేయడంలో కూడా పిళ్లై ప్రమేయం ఉందని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. పిళ్లై 29 సార్లు దర్యాప్తునకు సహకరించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. అన్యాయంగా పిటిషనర్‌ను అరెస్టు చేశారని ఆరోపించారు. కానీ ఈడీ అధికారులు హైదరాబాద్‌లో పిళ్లై నివాసంపై దాడులు చేసినప్పుడు అతని భార్య, మరికొందరు ఈడీ అధికారులను నియంత్రించారన్న ఆరోపణలున్నాయి. ఇతర నిందితులు సమీర్ మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్ చంద్రారెడ్డి, రాఘవ మాగుంట, మనీష్ సిసోడియా తదితరుల రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కొట్టివేశాం. మరోవైపు మనీలాండరింగ్ నేరంలో ఇతర నిందితుల కన్నా పిటిషనర్ పాత్ర చాలా తీవ్రమైనదిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అతని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం..’అని జస్టిస్ నాగ్‌పాల్ తీర్పులో స్పష్టం చేశారు.

జిల్లా వార్తలు


యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలకు సిద్ధమవుతున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ విధానంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆబ్జెక్టివ్ టైప్, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనుండగా కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలు దాటని వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు స్టడీ సర్కిల్ వైబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పీఓ సూచించారు.

ఆటో బోల్తా : ఒకరు మృతి

కామేపల్లి(కారేపల్లి): అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొత్తలింగాల వైపు వస్తున్న ఆటో కామేపల్లి మండలం బండిపాడు స్టేజీ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కారేపల్లి మండలం కొత్తూరు తండాకు చెందిన బానోతు ప్రశాంత్ (17) అక్కడికక్కడే మృతి చెందగా, డోర్నకల్‌కు చెందిన బానోతు సునీత, ధరావత్ అచ్చమ్మ, గార్లకు చెందిన జర్పుల చౌరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు కామేపల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం


పాఠశాలలకు పుస్తకాలు అందజేస్తున్న రవికుమార్

కల్లూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ తెలిపారు. కల్లూరు మండలం నారాయణపురం, లోకవరం పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం చేపట్టిన బడిబాట కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి చేర్పించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ అధికారి మాధవరావు, ఎంఈఓ దామోదర్‌ప్రసాద్ ,ఆర్‌పీలు వేలాద్రి, ఆరీఫ్, రవీంద్ర, రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మి, తాయారు, సాబీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో విలేజ్ బస్ ఆఫీసర్లు!

- ఖమ్మం రీజియన్‌లో 134 మంది నియామకం
- నేటి నుంచి విధులు నిర్వర్తించనున్న ఉద్యోగులు
- ప్రజలకు చేరువయ్యేందుకు ఆర్టీసీలో కొత్త వ్యవస్థ



కొత్తగూడెం ఆర్టీసీ డిపో

చుంచుపల్లి: ఆర్టీసీ సంస్థ ఆర్థిక పరిపుష్టి సాధించడంతో ప్రయాణికులక మెరుగైన సేవలందించేలా ఎప్పటికప్పుడుకొత్త మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా డిపోల పరిధిలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించింది. ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పలువురికి ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో మొదటి విడతగా 134 మందిని ఎంపిక చేయగా వీరు తమకు కేటాయించిన గ్రామాల్లో ఆర్టీసీ సేవలను వివరిస్తూ, ప్రయాణికులు సంస్థను ఆదరించేలా కృషి చేస్తారు. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం డిపో పరిధిలో 35 మంది, సత్తుపల్లి డిపోలో 25మంది, భద్రాచలంలో 24 మంది, కొత్తగూడెంలో 22 మంది, మధిరలో 20 మందితో పాటు మణుగూరు ఎనిమిది మందిని నియమించారు. ఇప్పటికే నిర్వర్తించాల్సిన బాధ్యతలపై శిక్షణ ఇవ్వగా, టీషర్టులు, బ్యాగులు, గుర్తింపు కార్డులు అందజేశారు.

గ్రామాల వారీగా బాధ్యతలు

పెద్ద గ్రామానికైతే ఒకరు చొప్పున. చిన్న గ్రామాలైతే రెండు, మూడింటికి ఒక విలేజ్ బస్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరు ప్రజలతో సమావేశమై బస్సుల రాకపోకల సమయం, నూతన సర్వీస్లు, సమస్యల వివరాలు తెలుసుకుని అధికారులకు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు, జాతరల వివరాలను సేకరించి రద్దీకి అనుగుణంగా బస్ ట్రిప్పులు పెంచేలా చూస్తారు. శుభకార్యాలు జరిగే వారి ఇళ్లకు వెళ్లి ఆర్టీసీ బస్సు అద్దెకు తీసుకుంటే అందే రాయితీలను వివరిస్తారు. ఈక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సంఘాల నాయకులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులను సంప్రదిస్తారు. గతంలో బస్సులను సంబంధించి సమస్యలు ఉన్నా, కొత్త సర్వీస్ కావాలన్నా, అద్దెకు బస్సు తీసుకోవాలన్నా గ్రామాల ప్రజలు డిపోమేనేజర్లను సంప్రదించాల్సి వచ్చేది. ఒక్కోసారి డిపోకు వెళ్లలేక, ఫోన్ నంబర్లు అందుబాటులో లేక ప్రజలు ప్రైవేట్ సర్వీసులను ఆశ్రయించే వారు. కానీ విలేజ్ బస్ ఆఫీసర్లతో ఈ సమస్యలన్నీ తీరి ప్రజలకు ఆర్టీసీ మరింత చేరువవుతుందని భావిస్తున్నారు.

ఏం చేస్తారు..

విలేజ్ ఆఫీసర్లు శుక్రవారం నుంచి తమ విధులు నిర్వర్తించనున్నారు. ఆర్టీసీ ద్వారా అందించే సేవలను గ్రామాల్లో ప్రజలకు వివరించడమే కాక సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీని ఆదరించాలని అవగాహన కల్పిస్తారు. దివ్యాంగులు, వృద్ధులు, విద్యార్థులకు అందించే రాయితీ పథకాలు, బస్ పాస్‌ల వివరాలు వెల్లడిస్తారు. అంతేకాక గ్రామస్తుల నుంచి అందే వినతులు, ఫిర్యాదులు, సర్వీస్ అవసరమైన రూట్లను గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వనున్నారు.

ఆర్టీసీ సేవలు విస్తృతం చేసేలా...



ఆర్టీసీలో కొత్తగా విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థ అమల్లోకి వస్తోంది. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న వారు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆర్టీసీ సేవలను వివరిస్తారు. దీంతో పాటు ఆర్టీసీని ప్రజలకు చేరువ చేసేలా కృషి చేయనున్నారు.

– బి.వెంకటేశ్వరరావు, డీఎం, కొత్తగూడెం

మహిళా హక్కుల రక్షణకు ఉద్యమించాలి..

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల స్థాయి తరగతులు గురువారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. 2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతోందని గగ్గోలు పెట్టిన బీజేపీ నేతలు.. ఇప్పుడు అన్ని వస్తువుల ధరలు పెంచారని ఆరోపించారు. ఇక ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీని విస్మరించి ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించారని తెలిపారు. అలాగే, నల్లధనాన్ని తీసుకొచ్చి పేదలకు ఇవ్వడం, పేదలందరికీ ఇళ్ల నిర్మాణం హామీలేమీ నెరవేరలేదని చెప్పారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన మహిళలకే రక్షణ కల్పించలేని బీజేపీ నేతలు సాధారణ మహిళలకు ఏ రకంగా రక్షణ కల్పిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభించకుండా మహిళలను అణగదొక్కారని లక్ష్మి విమర్శించారు. ఇటీవల త్రిపురలో నెల రోజుల్లోనే 15 మంది మహిళలపై బీజేపీ నేతలు అత్యాచారం చేశారని మండిపడ్డారు. ఆతర్వాత బుగ్గవీటి సరళ, బత్తుల హైమావతి మాట్లాడగా, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, సభ్యులు అఫ్రోజ్ సమీనా, ప్రభావతి, ఎం.రమణ, పయ్యావుల ప్రభావతి, నాగసులోచన, మొహరున్నీసా బేగం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే టెండర్లు రద్దు


అధికారుల సమక్షంలో టెండర్లు ఖరారు చేస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గిరిజన గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నిబంధనల ప్రకారం నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలు సరఫరా చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ డీడీ, ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం 2023–24కు గాను విద్యాలయాలకు వివిధ రకాల వస్తువులు, ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా తక్కువగా కోట్ చేసిన ఏజెన్సీదారులకు కాంట్రాక్ట్ అప్పగించాక డేవిడ్‌రాజ్ మాట్లాడారు. నిబంధనల మేరకు నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలను సరఫరా చేయకున్నా, ఫిర్యాదులు వచ్చినా టెండర్ దారులను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు నర్సింహారావు, చంద్రమోహన్, జీసీసీ మేనేజర్లు వీరభద్రస్వామి, కృష్ణసాగర్ తో పాటు హరిసింగ్, దేవదాస్, పద్మావతికుమారి, కృష్ణార్జున పాల్గొన్నారు.

‘ప్రజాగర్జన’ సభను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలోని, రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారం, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, రాజ్యాంగ, లౌకిక వ్యవస్థల పరిరక్షణే ధ్యేయంగా ఈనెల 11న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ప్రజాగర్జన సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు సీపీఐ జాతీయ నేతలు డి.రాజా, కె.నారాయణతో పాటు సయ్యద్ అజీజ్‌పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగానే కాక విభజన హామీలైన బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్వహించినట్లుగా ఇప్పుడు నిర్వహిస్తున్న సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని కూనంనేని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, చంద్రగిరి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వై.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని బాలికను రక్షించిన చైల్డ్‌లైన్

24గంటల్లో చిరునామా గుర్తింపు, తల్లికి అప్పగింత


బాలికను తల్లికి అప్పగిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: మతిస్థిమితం లేని పదేళ్ల బాలిక ఖమ్మంలో తిరుగుతుండగా చైల్డ్‌లైన్ 1098 బృందం గుర్తించి వివిధ ఆధారాల ద్వారా తల్లిని పిలిపించి అప్పగించారు. చైల్డ్‌లైన్–1098 కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మతిస్థిమితం లేని మూగ బాలిక ఖమ్మంలో ఒంటరిగా తిరుగుతుండగా బుధవారం రాత్రి గుర్తించిన అంగన్‌వాడీ టీచర్ 1098కు సమాచారం ఇచ్చింది. అంతేకాక పాపను త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుకెళ్లగా చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ చేరుకుని బాలలసదనంలో రక్షణ కల్పించారు. అనంతరం ఆమె వద్ద పరిశీలించగా ఇల్లెందు నుంచి ఖమ్మం వచ్చినట్లు పల్లెవెలుగు టికెట్ లభించింది. దీంతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌కు సమాచారం ఇవ్వగా వారు దర్పణ్ యాప్‌లో పరిశీలించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం పాతతండాకు చెందిన బాలికగా గుర్తించారు. ఈ ఆధారంగా బాలిక తల్లి, మేనమామ, అక్కడి అంగన్‌వాడీ టీచర్‌కు పిలిపించి సీడబ్ల్యూసీ సమక్షాన అప్పగించారు. బాలిక చిరునామాను కనుగొన్న చైల్డ్‌లైన్ కె.శ్రీనివాస్‌ను, హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యులు నర్సింహారావు, భాస్కర్‌ను సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరత రాణి అభినందించారు. అలాగే, బాలిక కుటుంబీకులకు కౌన్సెలింగ్ ఇస్తూ ఒంటరిగా వదిలేయకుండా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు లింగయ్య పాల్గొన్నారు.